నాపాక ఆలయాన్ని అభివృద్ధి చేస్తా..


చిట్యాల: మహిళలను ఓటు అడుగుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

● బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

చిట్యాల: ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపిస్తే నాపాక ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లి, నైన్‌పాక గ్రామాల్లో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా గడపగడపకు తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అనంతరం నైన్‌పాకలో ఏర్పాటు చేసిన కార్నర్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డగా మీ ముందుకు వస్తున్నానని ఆదరించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, నారాయణరెడ్డి, మాచర్ల రఘు, గొర్రె శశి, ఉడుత వనక్క, చెక్క నర్సయ్య, పిట్టల నాగరాజు, రాజేష్, రవీందర్, నాయకులు వీరస్వామి, సంపత్ పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని గడప గడపకు తిరిగి నాయకులు శనివారం ప్రచారం చేశారు.

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గం కాపాడుకోవడం కోసం బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శనివారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని 17 వ వార్డులో దొంగల రాజేందర్, 29 వార్డులో వార్డు అధ్యక్షుడు ఈర్ల మల్లికసదానందం ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఆవుల సంతోష్, భూత్ అధ్యక్షుడు సిలువేరు కార్తీక్, తాండ్ర హరీష్, దాసరి సంతోష్ ఉన్నారు.

ఎడ్ల బండి ఆపి..


ఓటు అడుగుతున్న కీర్తిరెడ్డి

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో బీజేపీ భరోసా యాత్రలో భాగంగా బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అందులో భాగంగా గ్రామంలోని మహిళా రైతు తన వ్యవసాయ భూమి వద్దకు ఎడ్ల బండిపై వెళ్తున్న క్రమంలో ఆపు.. ఆపు.. అక్క మీ ఓటు తనకే వేయాలని కోరింది. దీంతో ఆమె తప్పకుండా మేడం అంటు మాట ఇచ్చింది.

సింగరేణి ప్రైవేటీకరణకు కుట్రలు


రామగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి గుండూరావు

● మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రామగిరి: సింగరేణి ప్రైవేటీకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను మోసం చేశాయని, వారి సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం రాత్రి రామగిరిలో సీపీఐ-ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. కమ్యూనిస్టుల మద్దతుతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. సింగరేణి ప్రైవేటీకరణకు కేసీఆర్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులు వైవీ.రావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి, డీటీ రావు, గంగాధర్, కాంగ్రెస్ నాయకులు తోట్ల తిరుపతి యాదవ్, తోట చంద్రయ్య, ఆరెల్లి దేవక్క తదితరులున్నారు.

ఎన్‌ఎస్‌యూఐ బ్లాక్ అధ్యక్షుడిగా సందీప్‌గౌడ్

మంథని: మంథని అసెంబ్లీ నియోజకవర్గ(బీ) బ్లాక్ ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడిగా కెక్కర్ల సందీప్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం మంథనిలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చేతులమీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు.

ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను మోసం చేసిందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు న్యాతరి శ్యాంసుందర్ అన్నారు. ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివారం మంథని, కాటారం మండలాలకు అంబేద్కర్ మనవడు యశ్వంత్ వస్తున్నారని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం తదితరులున్నారు.

పాలకుర్తి: మండలంలోని కన్నాల, బోడగుట్టపల్లి గ్రామాల్లో మంథని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మద్దతుగా స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జీడీనగర్ సర్పంచ్ సూర సమ్మయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అరుకాల సతీశ్ పాల్గొన్నారు.

మహాముత్తారం: తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోందని కాంగ్రెస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబు ఆరోపించారు. ములుగుపల్లిలో శనివారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో వరంగల్ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో కలిసి మాట్లాడారు. మంథనిలో ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులు చేస్తూ నడిరోడ్డుమీద కిరాతకంగా హతమార్చుతున్నారని ఆరోపించారు. పార్టీ ఎలక్షన్ క్యాంపెయిన్ జాయింట్ సెక్రటరీ వెంకట్‌రెడ్డి, ఎంపీపీ సుభద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు శారద తదితరులున్నారు.

కాటారం: చింతకాని ఎంపీటీసీ సభ్యురాలు ఉడుముల విజయారెడ్డి శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు ఆమెకు కండువా కప్పారు. ఎంపీపీ సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

కేసీఆర్ దుష్ప్రచారాలను నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని కర్ణాటక వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దినేష్ గుండూరావ్ అన్నారు. ధన్వాడలో శనివారం ఆయన మాట్లాడారు. కర్ణాటకలో ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరు గ్యారంటీ స్కీంలు పక్కాగా అమలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారంటీ స్కీంలను పక్కాగా అమలు చేస్తామని మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు అన్నారు. గంగారంలో శనివారం ప్రచారం నిర్వహించారు. కాటారానికి చెందిన గడ్డం చంద్రయ్య, ఓలపు రాజబాబు కాంగ్రెస్‌లో చేరారు.

కాళేశ్వరం: మంథని ఎమ్మెల్యేగా దుద్దిళ్ల శ్రీధర్‌బాబును భారీ మెజారిటీతో గెలిపించాలని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు కోరారు. శనివారం కాళేశ్వరం, మెట్‌పల్లి, బీరాసాగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ శోభ, ఎంపీటీసీ సభ్యురాలు మమత, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ తదితరులున్నారు.

మద్యం పట్టివేత

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని బాంబులగడ్డలో అక్రమంగా నిల్వ చేసిన మద్యం(బీర్)బాటిళ్లను పట్టుకున్నట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో ఎస్సై శ్రావణ్‌కుమార్ సిబ్బందితో శనివారం తనిఖీలు చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు బండారి కవిత, బండారి నగేష్, శ్రీనివాస్ ఇళ్లలో 131 బీరు బాటిళ్లు దొరికినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఉన్న మద్యాన్ని సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

క్లుప్తంగా

భక్తులకు పాల పంపిణీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు మహదేవపూర్‌కు చెందిన జీవన్‌రెడ్డి-రజనీ దంపతులు శనివారం పాలు పంపిణీ చేశారు. వారి వెంట ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, మాజీ ధర్మకర్త తిరుపతిరెడ్డి, దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన



భూపాలపల్లి అర్బన్: మండలంలోని గొల్లబుద్దారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఓటు హక్కు వినియోగంపై అవగహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గోపాల్, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌రాజు, యాకుబ్‌పాషా, శ్రీనివాసరావు, రమేష్, తిరుపతి, శరత్ బాబు పాల్గొన్నారు.

బహుజనులు ఏకమవ్వాలి



కాటారం: రాజ్యాధికార సాధన కోసం బహుజనులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంథని ఎమ్మెల్యే అభ్యర్థి చిట్యాల శ్రీనివాస్‌కు మద్దతుగా మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన రోడ్డు షోలో విశారదన్ మహారాజ్ పాల్గొని మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఐక్యతతో ముందుకు సాగితే రాజ్యాధికారం సాధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



భూపాలపల్లి రూరల్: మంథని నియోజకవర్గం పలిమెల మండలానికి చెందిన సుమారు 50 మంది బీజేపీలో చేరారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారికి పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ మాధవన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సత్యపాల్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


టేకుమట్ల: అవగాహన కల్పిస్తున్న సీఐ వేణుచందర్

టేకుమట్ల: ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సహకరించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ దాసారపు వేణుచందర్ హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని రామకిష్టాపూర్(వి), వెలిశాల, రామకిష్టాపూర్(టి)లో చిట్యాల సర్కిల్ సీఐ వేణుచందర్, ఎస్సై గట్ల సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఓటు వినియోగం, శాంతి భద్రతలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల, మొగుళ్ళపల్లి ఎస్సైలు జంగిళి రమేష్, శ్రీధర్, ఏఎస్సైలు అమరేందర్‌రెడ్డి, ఇంతియాజుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ మహేందర్, సీఆర్‌పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

రేగొండ(కొత్తపల్లిగోరి): అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రేగొండ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంతోపాటు చిన్నకోడేపాక, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి గ్రామాల్లో సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్స్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, పోలీస్ సిబ్బంది తదిదరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని రంగాపూర్, ఇస్సిపేట, పాత ఇస్సిపేట గ్రామాల్లో ఎస్సై శ్రీధర్, ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట పోలీసు అధికారులు, సిబ్బంది, సాయుధ పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. ఓటు అనే పవిత్ర ఆయుధాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మహదేవపూర్: మండలంలోని అంబట్‌పల్లి, సూరారం గ్రామలలో కేంద్ర బాలగాలతో శనివారం సీఐ కిరణ్‌కుమార్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, పలిమెల ఎస్సై తమాషారెడ్డి పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన మహిళలు


నిరసన తెలుపుతున్న మహిళలు

కాటారం: మండలంలోని గోపాలపూర్‌లో తాగు నీటి కోసం మహిళలు శనివారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదని తెలిపారు. పాలకులు, అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని సమస్య పరిష్కరించేంత వరకు ఊరుకునేది లేదని భీష్మించారు. ఆందోళన సమాచారం తెలుసుకున్న ఎంపీఓ ఉపేంద్రయ్య తాగునీటి సరఫరా జరిగేలా చూస్తామని ఫోన్ ద్వారా హామీ ఇచ్చారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ


బుక్స్ అందజేస్తున్న పోలీస్ అధికారులు

రేగొండ: మండలంలోని రాయపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు శనివారం నోట్‌బుక్స్, స్టేషనరీ, బ్యాగులను పంపిణీ చేశారు. వరంగల్ రిజర్వ్ ఎస్సై రవితేజ, ములుగు ఎస్సై రాకేష్, సీఐఎస్‌ఎఫ్ అఖిల్ పాల్గొని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రవితేజ మాట్లాడుతూ.. వరంగల్ సీపీ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తమ వంతు సహకారం అందించటం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్ని సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ సంతోష్, గంధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ కష్టాలే..

● బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


శాయంపేట: ఎమ్మెల్యే గండ్రకు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళలు

శాయంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే కరెంట్ కష్టాలు తప్పవని భూపాలపల్లి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని కొప్పుల, వసంతాపూర్, గంగిరేణిగూడెం సూర్యానాయక్‌తండా, కాట్రపల్లి, ప్రగతిసింగారం, పత్తిపాక, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో శనివారం ప్రజా ఆశీర్వాద యాత్రను జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకోడెపాక రోడ్ షోలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కేసీఆర్ ప్రభుత్వాన్ని గెలిపించాలని అన్నారు. 80వేల కోట్ల ప్రజాధనంతో రైతాంగానికి రైతుబంధు అందిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలోకి వస్తే అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు.ఈ నెల 30వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ రాంశెట్టి లతలక్ష్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు మాధురిమహేఅనూష, మంజుల, రమేష్, సుమలత, ఎంపీటీసీలు వేణుగోపాలప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా ఉండాలి

చిట్యాల: నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి ప్రజలు అండగా ఉండి మళ్లీ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో నియోజకవర్గాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక నిధులు కేటాయించడంతో ఈ ప్రాంతం అభివృద్ధి జరిగిందన్నారు. గండ్ర వెంకట రమణారెడ్డిని ప్రజలు గెలిపిస్తేనే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు మేకల కుమార్, చిగురు రవి, బొళవేన భిక్షపతిలతో పాటు పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఏరుకొండ గణపతి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు జాలిగపు కిష్టయ్య, నాయకులు దొడ్డి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలో భూపాలపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోటి ధర్మారావు, పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి నర్సింగరావు, నాయకులు ఎలేటి నర్సింహరెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, జనార్ధన్, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న కష్ట సుఖాల్లో పాలపంచుకుంటూ అందుబాటులో ఉంటున్నానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఏరియాలోని కేటీకే 5వ గనిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా పని చేసిన రెండు సార్లు 2వేల సింగరేణి క్వాటర్లు నిర్మించినట్లు తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా భూపాలపల్లిలో డబుల్‌బెడ్ రూం క్వాటర్లు నిర్మించినట్లు వివరించారు.

బీఆర్‌ఎస్‌కు గౌడ సంఘాల మద్దతు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీకి గౌడ సంఘాల జేఏసీ మద్దతు ఇస్తున్నట్లు గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద ఉమ్మడి జిల్లా కన్వీనర్ చిర్ర రాజుగౌడ్, జిల్లా గౌడ సంఘాల చైర్మన్ బుర్ర రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గౌడ సంఘాల అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం 30గుంటల స్థలం, రూ.1కోటి నిధులు కేటాయించినట్లు తెలిపారు. గండ్ర వెంకటరమణారెడ్డి పూర్తి మద్దతు ప్రకటించి ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తాటి అశోక్, బుర్ర కుమార్‌స్వామి, వేణుగోపాల్, శ్రీహరి, రవీందర్, గణపతి, సదానందం, శ్రీధర్, రాజమల్లు పాల్గొన్నారు.


శాయంపేట: అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర


భూపాలపల్లి అర్బన్: కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


శాయంపేట: బతుకమ్మ ఎత్తుకున్న గండ్ర జ్యోతి

తొమ్మిదేళ్లలో అనేక పనులు చేశాం

● జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న పుట్ట మధు

మంథని: సాయం చేసిన తనను చెడ్డోనిగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని జెడ్పీ చైర్మన్, మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మంథని మండలంలోని ఖానాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాడు ఎమ్మెల్యేగా, ఇప్పుడు జెడ్పీ చైర్మన్‌గా ఖానాపూర్‌ను అభివృద్ధి చేశానన్నారు. మంథని నుంచి ఎల్‌మడుగు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో ఇప్పటికే బండ్ల మడుగు దాకా రోడ్డు వేశామని తెలిపారు. నల్లవాగుపై కల్వర్టు నిర్మించి, రైతుల కష్టాలు తీర్చామని పేర్కొన్నారు. తన సేవా కార్యక్రమాలు, చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందే కనిపిస్తుంటే కాంగ్రెసోళ్లు మాత్రం వంద అబాండాలు వేస్తున్నారని వాపోయారు. అనంతరం ఎక్లాస్‌పూర్ వెళ్లిన ఆయనకు మంథని జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత శంకర్‌లాల్ భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందించి, సన్మానించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను, ప్రభుత్వ ఫలాలను దళిత, బడుగు బలహీన వర్గాలకు అందించిన చరిత్ర పుట్ట మధుకే దక్కుతుందని పేర్కొన్నారు. ఆయనను గెలిపించాలని కోరారు.

గెలిపించండి.. సేవకుడిలా పనిచేస్తా

ముత్తారం: మంథని ఎమ్మెల్యేగా గెలిపిస్తే సేవకుడిలా పని చేస్తానని జెడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు అన్నారు. శనివారం ముత్తారం మండలంలోని మచ్చుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీసీ బిడ్డగా ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన తనను అంతం చేయాలని చూస్తున్నారని పేర్కొన్నారు. అయినా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రౌడీలు, గుండాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఎన్నికల్లో గెలవాలని చూస్తోందని ఆరోపించారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్, జెడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్, సర్పంచ్‌ల ఫోరం మండల కన్వీనర్ నూనె కుమార్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'నాయకుల కొనుగోలుకు ప్రయత్నాలు'

రామగిరి: ఎన్నికలు రాగానే కాంగ్రెస్ వాళ్లు నోట్ల సంచులతో వచ్చి, నాయకుల కొనుగోలుకు ప్రయత్నాలు చేస్తున్నారని మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు ఆరోపించారు. శనివారం సెంటనరీకాలనీలోని ఓ గార్డెన్‌లో టీబీజీకేఎస్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి కమాన్‌పూర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరమణా రెడ్డి ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై ఎన్నో ఆరోపణలు చేసి, మళ్లీ ఆయన పంచనే చేరడంలో ఆంతర్యమేమిటో చెప్పాలన్నారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్, జనరల్ సెక్రటరీ మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, ఆర్జీ-3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ అభ్యర్థి మధు కోరారు. శనివారం కల్వచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2018లో వెన్నుపోటు పొడిచిన గ్రామ సర్పంచ్ భర్త స్వలాభం కోసం మళ్లీ ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు పంచన చేరాడన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశి రవీందర్, గ్రామ శాఖ అధ్యక్షుడు జాపతి శేఖర్, వైస్ ఎంపీపీ శ్రీదేవి, నాయకులున్నారు.

మంథని: మంథని నుంచి ఎమ్మెల్యేగా జెడ్పీ చైర్మన్ పుట్ట మధు విజయం సాధిస్తారని మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్ అన్నారు. శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మున్నూరు కాపుల మద్దతు మధుకేనని తెలిపారు. సంఘం ఉపాధ్యక్షులు ఎల్.అనిల్, ఎం.రమేశ్‌కుమార్, సెక్రటరీ సురేష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మధును గెలిపించాలి

అసెంబ్లీలో బడుగుల గొంతు వినిపించాలంటే బహుజన బిడ్డ పుట్ట మధును గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికొండ విక్రమ్ గౌడ్ కోరారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడారు. బీసీల ఆత్మగౌరవం కాపాడటం కోసం మధు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. బహుజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు కే యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య ఉన్నారు.

గత ఎన్నికల్లో అసత్యపు ఆరోపణలు

మహాముత్తారం: వచ్చే ఎన్నికల్లో ఆదరిస్తే ఐదేండ్లు సేవకుడిలా పని చేస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు అన్నారు. శనివారం మహాముత్తారం మండలకేంద్రంతోపాటు మహబూబ్‌పల్లిలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌వాళ్లు గత ఎన్నికల్లో అనేక అసత్యపు ఆరోపణలు చేసి, తనను ప్రజలకు దూరం చేశారని అన్నారు. ఇప్పుడూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ చైర్మన్ శాంతకుమార్, రైతుబంధు సమితి అధ్యక్షుడు రాము, ఎంపీటీసీ సభ్యుడు నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ పార్టీ, తనపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మొద్దని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు కోరారు. శనివారం కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు, రాజాపూర్, కిష్టంపల్లె, కమాన్‌పూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు.

కస్తూర్బా పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయినులు

కాటారం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్లు, ప్రచారం, ఓటింగ్ విధానం, ఎన్నిక పలు అంశాలపై ఉపాధ్యాయినులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్‌ల విద్యార్థినులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు చేపట్టి ఓట్లు అధికంగా వచ్చిన అభ్యర్థిని గెలిచినట్లు ప్రకటించారు. అనంతరం గెలుపు ర్యాలీ చేపట్టారు. విద్యార్థులు రిటర్నింగ్ అధికారి, ప్రెసిడింగ్, పోలింగ్ సిబ్బందిగా విధులు నిర్వర్తించారు. విద్యార్థులకు ఎన్నికలు, ఓటింగ్‌పై అవగాహన కల్పించడం కోసం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి చల్ల సునీత తెలిపారు. ఉపాధ్యాయినులు సుజాత, రాజమణి, లక్ష్మి, శ్రీలత, సరిత, విజయ, నళిని ఉన్నారు.